# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

21.10.2025 మంగళవారం Tuesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 120 | పేజీలు : 8 Pages : 8 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana




రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789

ప్రముఖ నటుడు

## అస్రాని కన్నుమూత!

- ముంబైలో తుది శ్వాస

02



# రియాజ్ ఎన్‌కౌంటర్

- కానిస్టేబుల్‌హత్య కేసులో రెండు రోజుల క్రితం అరెస్ట్
- నిజామాబాద్‌ప్రభుత్వ దవాఖానలో చికిత్స
- ఏఆర్‌కానిస్టేబుల్‌గన్ లాక్కోబోయిన నిందితుడు
- పారిపోయే క్రమంలో పోలీసుల కాల్పులు, మృతి
- నిందిడిపై ఇప్పటికే 40 కేసులు

**నిజామాబాద్ పట్టణంలో కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసిన నిందితుడు షేక్ రియాజ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. సోమవారం ఉదయం ఆస్పత్రిలో ఏఆర్ కానిస్టేబుల్ నుంచి నిందితుడు గన్ లాక్కునే ప్రయత్నం చేశాడు. అక్కడి నుంచి పారిపోయేందుకు యత్నించడంతో అప్రమత్తమైన పోలీసులు కాల్పులు జరపడంతో రియాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు.**

**నిజామాబాద్, అక్టోబర్20:** నిజామాబాద్ పట్టణంలో విధి నిర్వహణలో ఉన్న సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను నిందితుడు షేక్ రియాజ్ కత్తితో అత్యంత దారుణంగా పొడిచి చంపాడు. వాహనాల దొంగతనం కేసులో రియాజ్‌ను అదుపులోకి తీసుకుని బైక్‌పై తీసుకెళ్తుండగా కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన ప్రమోద్ చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. షేక్ రియాజ్ కోసం గాలింపు

మిగతా 2 లో




## గత్యంతరం లేకే కాల్పులు

నిజామాబాద్ సీపీ సాయిచైతన్య

గాయపడ్డ కానిస్టేబుల్ ఆసిఫ్ రెండు చేతులకు తీవ్ర గాయాలు

02






## కానిస్టేబుల్ కుటుంబానికి కోటి ఎక్స్‌గ్రేషియా

పోలీస్ భద్రత సంక్షేమం నుంచి 16 లక్షలు

పోలీస్ వెల్ఫేర్ నుంచి 8 లక్షల రూపాయలు

ప్రకటించిన డీజీపీ శివధర్ రెడ్డి

02



## రెయిన్ అలర్ట్


- తెలంగాణలో మళ్లీ వర్షాలు
- నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ

02

# విక్రాంత్‌పై ప్రధాని దీపావళి

- పాక్‌పై విరుచుకపడ్డ మోదీ
- త్రివిధ దళాలకు ప్రధాని సెల్యూట్


04



ప్రతీ సంవత్సరం ప్రధాని మోదీ దేశ సరిహద్దుల్లో ఉండే సైనికులతో కలిసి దీపావళి వేడుక చేసుకుంటారు. ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈసారి గోవా తీరంలో నౌకాదళ సిబ్బందితో వేడుకలు చేసుకున్నారు.

## భారత్‌కు ట్రంప్ మరో వార్నింగ్

- రష్యా చమురు కొనుగోళ్లు ఆపేంతవరకు టారిఫ్ చెల్లించాల్సిందే!



04

## ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య



02

- కుటుంబ కలహాలే కారణం
- నల్లగొండ జిల్లాలో విషాదం

నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో పండగపూట విషాదం నెలకొంది. నాగలక్ష్మి((27)) అనే మహిళ.. తన ఇద్దరు పిల్లలను చంపేసి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ కలహాలతో తన ఇద్దరు పిల్లలు భువన్ సాయి (7), అవంతిక (9) చంపిన తాను కూడా ఉరి వేసుకుంది. వీరి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా జనకారం గ్రామం అని పోలీసులు తెలిపారు.

## సీఎంతో కొండా దంపతుల భేటీ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మంత్రి కొండా సురేఖ ఫ్యామిలీ భేటీ అయింది. ఈ దీపావళి పండుగ సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ నివాసానికి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి వెళ్లారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా కొండా దంపతుల వెంట సీఎం నివాసానికి వెళ్లారు.

02

## వారి మాటే వింటారా? మాకు ప్రాధాన్యత లేదా!

- కాంగ్రెస్ నేతలు చెప్పే పనులు చేయరా?
- పార్టీ ఫిరాయించినోడికి ప్రాధాన్యత ఇస్తారా?
- మంత్రి ఎదుట జీవన్ రెడ్డి ఫైర్

02



## 3 గంటలు.. 6వేల చలాన్లు

సిటీలో ట్రాఫిక్ పోలీస్ స్పెషల్ డ్రైవ్..

04



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలు...





# ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

**కుటుంబ కలహాలే కారణం ▪ నల్లగొండ జిల్లాలో విషాదం**

**హైదరాబాద్, అక్టోబర్ 20:** తెలంగాణలోని నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో పండగపూట విషాదం నెలకొంది. నాగలక్ష్మి అనే మహిళ.. తన ఇద్దరు పిల్లలను చంపేసి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ కలహాలతో తన ఇద్దరు పిల్లలను చంపిన తల్లి, ఆ తర్వాత తాను కూడా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నిర్ఘాంతపోయిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృతులను కుంచాల నాగలక్ష్మి (27), భువన్ సాయి (7), అవంతిక (9)గా గుర్తించారు. వీరి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా జనకారం గ్రామం అని తెలిపారు. భార్యా భర్తల గొడవే ఈ ఘటనకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రముఖ నటుడు అస్రాని కన్నుమూత!




**ముంబై, అక్టోబర్20:** ప్రముఖ బాలీవుడ్ నటుడు గోవర్ధన్ అస్రాని (84) కన్నుమూశారు. చాలాకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం ముంబైలో తుది శ్వాస విడిచారు. అస్రానీ మేనేజర్ బాబు భాయ్ థిబా మీడియాతో మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జుహూలోని ఆరోగ్య నిధి ఆసుపత్రిలో అస్రానీ మరణించారని చెప్పారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబం ఆయన ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్‌లో మృతి చెందిన విషయాన్ని పోస్ట్‌చేసింది. అస్రాని తన 50 ఏళ్ల సినీ జీవితంలో 350కి పైగా సినిమాల్లో నటించారు. కమెడియన్, సపోర్టింగ్ నటుడిగా హిందీ సినిమాల్లో రాణించారు. మేరే అప్నే, కోషిష్, బావర్చీ, పరిచయ్, అభిమాన్, చుప్కే చుప్కే లాంటి సినిమాల్లో నటించారు. బ్లాక్‌బస్టర్ మూవీ 'షోలే'లో కూడా పోలీసు ఆఫీసర్‌గా కనిపించారు.

# తెలంగాణలో మళ్లీ వర్షాలు

**నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం**

**పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ**



**హైదరాబాద్, అక్టోబర్20:** రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రానున్న 4రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే ఛాన్స్ ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే ఛాన్స్ ఉందని, దక్షిణ అండమాన్‌ని అనుకొని ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని తెలంగాణ వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో రానున్న 24గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. అది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతాలను ఆనుకొని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి బుధవారం వరకు పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆదివారం పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. గురువారం, శుక్రవారం ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెప్పింది. అలానే జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, ములుగు, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసినట్లుగా టీజీడీపీఎస్ వెల్లడించింది. హైదరాబాద్ కు కూడా వర్షం పడే అవకాశం ఉంది.

# రియాజ్ ఎన్‌కౌంటర్

**కానిస్టేబుల్‌హత్య కేసులో అరెస్ట్**

**నిజామాబాద్‌ప్రభుత్వ దవాఖానలో చికిత్స**

**ఏఆర్‌కానిస్టేబుల్‌గన్‌లాక్కోబోయిన నిందితుడు**

**పారిపోయే క్రమంలో పోలీసుల కాల్పులు, మృతి**

**నిందిడిపై ఇప్పటికే 40 కేసులు**



**నిజామాబాద్, అక్టోబర్20:** నిజామాబాద్ పట్టణంలో కానిస్టేబుల్ ప్రమోదన్ను హత్య చేసిన నిందితుడు షేక్ రియాజ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. సోమవారం ఉదయం ఆస్పత్రిలో ఏఆర్ కానిస్టేబుల్ నుంచి నిందితుడు గన్ లాక్కునే ప్రయత్నం చేశాడు. అక్కడి నుంచి పారిపోయేందుకు యత్నించడంతో అప్రమత్తమైన పోలీసులు కాల్పులు జరపడంతో రియాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ పట్టణంలో విధి నిర్వహణలో ఉన్న సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను నిందితుడు షేక్ రియాజ్ కత్తితో అత్యంత దారుణంగా పొడిచి చంపాడు. వాహనాల దొంగతనం కేసులో రియాజ్‌ను అదుపులోకి తీసుకుని బైక్‌పై తీసుకెళ్తుండగా కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన ప్రమోద్ చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. షేక్ రియాజ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సారంగపూర్‌లోని అటవీ ప్రాంతంలో పడివున్న ఓ పాడుబడిన లారీలో దాక్కుని ఉండగా పోలీసులకు పట్టుకున్నారు. ఆ సమయంలో పోలీసుల నుంచి పారిపోయేందుకు రియాజ్ ప్రయత్నించాడు. ఈ క్రమంలో అతనికి గాయాలు కావడంతో ఆదివారం రాత్రి నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. నిజామాబాద్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సమయంలో ఆస్పత్రి నుంచి పారిపోయేందుకు రియాజ్ ప్రయత్నించాడు. సోమవారం తన పక్కనే ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ గన్ లాక్కొని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో పోలీసులు కాల్పులు జరపడంతో రియాజ్ మరణించాడు. రియాజ్ ఎన్‌కౌంటర్‌పై డీజీపీ శివధర్ రెడ్డి స్పందించారు. ఆస్పత్రి నుంచి తప్పించుకునేందుకు రియాజ్.. ఏఆర్ పోలీసుల గన్‌ను లాక్కున్నాడని తెలిపారు. ఆ గన్‌తో పోలీసులపై కాల్పులు జరపబోయాడని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడే ప్రయత్నంలో కాల్పులు జరపాల్సి వచ్చిందని వివరించారు.

**బోధన్‌లో హర్షం వ్యక్తం**

నిజామాబాద్ పోలీసుల తీరుపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం బోధన్‌లో పలువురు సంబురాలు చేసుకున్నారు. రియాజ్ ఎన్‌కౌంటర్ సరైందేనని యువకులు పేర్కొంటున్నారు. కానిస్టేబుల్ హత్యతోపాటు మరో వ్యక్తి ఆసీఫ్ పై దాడి చేయడం శోచనీయమన్నారు. పరారైన నిందితుడిని పట్టుకునే క్రమంలో మరో వ్యక్తిపై దాడి చేసి.. దవాఖానాలో చికిత్స పొందుతూ మరో మారు పారిపోయేందుకు యత్నించి మరో కానిస్టేబుల్ పై దాడికి పాల్పడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలో నిందితుడిని ఎన్కౌంటర్ చేసిన పోలీసుల తీరు హర్షణీయమని అన్నారు. రౌడీ షీటర్లకు ఇది సరైన గుణపాఠమని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరపాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ద్యాకం గల్లీ చౌరస్తాలో పటాకులు కాల్చి, స్వీట్లు పంచారు.

# కానిస్టేబుల్ కుటుంబానికి కోటి ఎక్స్‌గ్రేషియా

**పోలీస్ భద్రత సంక్షేమం నుంచి 16 లక్షలు**

**పోలీస్ వెల్ఫేర్ నుంచి 8 లక్షల రూపాయలు**

**ప్రకటించిన డీజీపీ శివధర్ రెడ్డి**



**హైదరాబాద్, అక్టోబర్ 20:** కరడుగట్టిన నేరస్తుడు షేక్ రియాజ్ చేతిలో దారుణ హత్యకు గురైన పోలీస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్‌కు పోలీసు శాఖ తరుపున డీజీపీ శివధర్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో లా అండ్ ఆర్డర్‌ను పూర్తి స్థాయిలో కాపాడేందుకు తెలంగాణ పోలీసు శాఖ నిబద్ధతతో ఉందని డీజీపీ స్పష్టం చేశారు. ఎలాంటి తీవ్ర నేరస్తులను అయినా కఠినంగా అణచివేస్తామని వెల్లడించారు. భర్త ప్రమోద్‌ను పోగొట్టుకున్న అతని భార్య ప్రణీతకు, అతి చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన అతని ముగ్గురు కుమారులకు, వారి కుటుంబానికి ప్రభుత్వం, పోలీసు శాఖ పూర్తి స్థాయిలో అండగా ఉంటాయని హామీ ఇచ్చారు. జీవో ఆర్టీ నెంబర్ 411 ప్రకారం ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కానిస్టేబుల్ పదవీ విరమణ వరకు లాస్ట్ పే డ్రాన్ శాలరీతో పాటు కుటుంబసభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామన్నారు. జీవో 155 ప్రకారం 300 గజాల ఇంటి స్థలం మంజూరు చేస్తామన్నారు. అలాగే పోలీస్ భద్రత సంక్షేమం నుంచి 16 లక్షల ఎక్స్ గ్రేషియా, పోలీస్ వెల్ఫేర్ నుంచి 8 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియాను ప్రమోద్ కుటుంబానికి చెల్లించి వారి కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు డీజీపీ. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ తరుపున డీజీపీ శివధర్ రెడ్డి నివాళులర్పించారు.



# గత్యంతరం లేకే కాల్పులు

**- నిజామాబాద్ సీపీ కీలక ప్రకటన**

**హైదరాబాద్, అక్టోబర్20:** గత్యంతరం లేకే ఎన్‌కౌంటర్‌చేయాల్సి వచ్చిందని నిజామాబాద్ సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ కానిస్టేబుల్‌పై దాడి చేసి పారిపోబోతుండగా, ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో రియాజ్ మరణించాడని చెప్పారు. నిందితుడు రియాజ్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో గది అద్దాలు ధ్వంసం చేశాడు. కానిస్టేబుల్ ఆసిఫ్ చెకింగ్‌లో భాగంగా రియాజ్ గది వద్దకు వెళ్లగా, పెద్ద శబ్దం వినిపించటంతో రూమ్‌లోకి వెళ్లాడు. ఈ క్రమంలో ఆసిఫ్ దగ్గరున్న తుపాకీ రియాజ్ లాక్కున్నాడు. అనంతరం రియాజ్ ట్రిగ్గర్ నొక్కే ప్రయత్నం చేశాడు. దీంతో గత్యంతరం లేక పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చిందని సీపీ క్లారిటీ ఇచ్చారు. రియాజ్ ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. రియాజ్ చేతిలో గాయపడ్డ కానిస్టేబుల్ ఆసిఫ్ రెండు చేతులకు తీవ్ర గాయ్యాలయ్యాయని, అతని చేతులు పని చేయాలంటే ఏడాది పడుతుందని డాక్టర్లు చెప్పారని వెల్లడించారు. ప్రొసిజర్ ప్రకారం రియాజ్ డెడ్ బాడీకి పోస్ట్ మార్టం పూర్తి చేసి మృతదేహాన్ని అతడి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని చెప్పారు.

# సీఎంతో కొండా దంపతుల భేటీ

**హైదరాబాద్, అక్టోబర్ 20:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మంత్రి కొండా సురేఖ ఫ్యామిలీ భేటీ అయింది. ఈ దీపావళి పండుగ సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ నివాసానికి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి వెళ్లారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా కొండా దంపతుల వెంట సీఎం నివాసానికి వెళ్లారు. తెలంగాణ కాంగ్రెస్ లో కొన్ని రోజులుగా మంత్రి కొండా సురేఖ విషయంలో వివాదం రేగుతోంది. దీనికి సంబంధించి ఈ భేటీలో ప్రధానంగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. మంత్రి కొండా సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ఇటీవల తొలగించడం, ఆయన కోసం పోలీసులు మంత్రి ఇంటికి వెళ్లడం తదితర పరిణామాలు చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఈ భేటీ జరిగినట్టు సమాచారం. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మంత్రి కొండా సురేఖ దంపతులు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



# మాకు ప్రాధాన్యత లేదా..

**మంత్రి ఎదుట జీవన్ రెడ్డి ఫైర్**



**జగిత్యాల, అక్టోబర్ 20:** ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వ్యవహారశైలి పట్ల మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు ఫిర్యాదు చేశారు. వలస దారులు చెప్తేనే పనులు చేస్తారా? అంటూ మంత్రి ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు చెప్తే పనులు చేయరా? అంటూ మండిపడ్డారు. పదేళ్లు దోచుకున్న అనుభవం ఉందని.. అతడి మాటలే వింటారా? అంటూ సంచలన కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం ఏంటో అర్థం కావడం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయించినోడు చెప్తేనే పనులు చేస్తామని రూల్ పెట్టారా? అని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయించినోడికి.. ప్రాధాన్యత ఇస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి నుంచి ఉన్న వారిని పట్టించుకోరా? అని ఆవేదన చెందారు. పార్టీ ఫిరాయించినోడికి ఇప్పటికీ సభ్యత్వం లేదంటూ ఎమ్మెల్యే సంజయ్‌పై మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మండిపడ్డారు.

**కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో..**

కాగా.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ మంత్రులపై ఆరోపణలు చేసేముందు బీఆర్ఎస్‌పై కవిత చేసిన ఆరోపణలకు కేటీఆర్ ముందుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కమీషన్లకు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ పార్టీ అంటూ వ్యాఖ్యలు చేశారు. దోచుకోవడం, దాచుకోవడం కేసీఆర్ కుటుంబానికే తెలుసన్నారు. మంత్రులపై ఆరోపణలు చేసే ముందు కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో అంటూ హెచ్చరించారు. ధర్మపురికి డిగ్రీ కళాశాల మంజూరు చేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
మంగళవారం 21 అక్టోబర్ 2025 కరీంనగర్


# హైడ్రా బాధితుల కన్నీటిలో ప్రభుత్వం కొట్టుకుపోతుంది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు



**హైదరాబాద్, అక్టోబర్ 20:** సున్నం చెరువు హైడ్రా కూల్చివేతల బాధితులతో బీఆర్ఎస్ నేతలు దీపావళి వేడుకలు జరుపుకున్నారు. వేడుకలకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సున్నం చెరువు బాధిత కుటుంబాల పిల్లలతో కలిసి టపాకాయలు కాల్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైడ్రా పేరుతో పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు పంపి, వారి కడుపు కొట్టి ఇండ్లను కూల్చారని, నగరంలో పేదలు గూడు చెదిరి పోయిన పక్షులలాగా అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వచ్చి పేదలపై దౌర్జన్యం చేశారన్న ఆయన మాకు స్థలం పేపర్లు ఉన్నాయన్న పట్టించుకోలేదని, కనీసం చిన్న పిల్లలు పుస్తకాలు తీసుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని ఇంతకన్న దుర్మార్గం ఏముంటుందని ప్రశ్నించారు. పేదలకు న్యాయం చేయాలని, కేసీఆర్ కట్టించిన లక్ష ఇండ్లలో ఇంకా 40 వేల ఇండ్లు మిగిలి ఉన్నాయన్న కేటీఆర్ వెంటనే వాటిని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా కూల్చివేతలలో ఇండ్లు కోల్పోయిన బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని లేదంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ పేదల పక్షాన నిలబడుతుందని.. కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయకపోతే మేము ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మాయమాటలు చెప్పి, మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి హైదరాబాద్ అభివృద్ధి కోసం సర్కార్ కొత్తగా ఒక్క ఇల్లు కట్టింది లేదు.. ఒక్క ఇటుక పెట్టలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో నగరంలో పేదలకు 20 వేల లీటర్ల ఉచిత నీటిని సరఫరా చేస్తే ఇప్పుడు చాలా ప్రాంతాల్లో నల్లా నీళ్లు రావడం లేదన్నారు. ఇంకో రెండేళ్లలో వచ్చేది బీఆర్ ఎస్ ప్రభుత్వమేనని, మీరెవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. సున్నం చెరువుతో పాటు హైడ్రా వల్ల నష్టపోయిన ప్రతీ ఒక్కరి పేరు, అడ్రస్, ఫోన్ నెంబర్లు ఉన్నాయని అందరికీ న్యాయం చేస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ నరకాసుర ప్రభుత్వం పోయాక దీపావళి వేడుకలను పెద్దగా జరుపుకుందామని, పేదల కన్నీళ్లల్లో ఈ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని అన్నారు. పేదలకు న్యాయం జరిగేదాకా పోరాడుతామని.. బీఆర్ఎస్ ప్రభుత్వం హైడ్రా బాధితులకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే శంభీపూర్ రాజు, అల్లపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు కొమిరిశెట్టి సాయిబాబా, రంగారావు, మారబోయిన రవి యాదవ్ పాల్గొన్నారు.

# పోలీసులకే రక్షణ లేని పరిస్థితి దురదృష్టకరం

- మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, అక్టోబర్ 20:** చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని మాజీ మంత్రి హరీష్ రావు సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీమంత్రి మాట్లాడుతూ.. భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ అంటేనే ఒకప్పుడు మతసామరస్యానికి ప్రతీకగా ఉండేదని గుర్తుచేశారు. చార్మినార్‌లో అమ్మవారి దేవాలయం ఉండడం.. హిందువులు ముస్లింలను గౌరవించడం, ముస్లింలు హిందువులను గౌరవించడం వంటి సాంప్రదాయాలు ఉన్న గొప్ప సంస్కృతి మనదని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో పోలీసులకే రక్షణ లేని పరిస్థితి ఉందన్నారు. పోలీస్ కానిస్టేబుల్‌ను ఒక రౌడీషీటర్ చంపడం చాలా దురదృష్టకర సంఘటనగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రే హెూంమంత్రి అయ్యుండి కూడా రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలమయ్యాయని విమర్శించారు. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడడంలో విఫలమైందని వ్యాఖ్యలు చేశారు. చనిపోయిన కానిస్టేబుల్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని... వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు తగ్గిపోయి గుండాల రాజ్యం ఏర్పడిందని దుయ్యబట్టారు. ప్రజల ప్రాణ, మానాలకు రక్షణ కల్పించే పోలీసులకే రక్షణ లేని పరిస్థితి ఏర్పడడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొని అభివృద్ధిలో ముందుకు సాగాలని అమ్మవారిని ప్రార్థించడం జరిగిందని తెలిపారు. కేబినెట్‌లో ఏం జరిగిందో తాను చెప్పాల్సిన పనిలేదని... స్వయానా మంత్రి కుమార్తెనే చెప్పిందన్నారు. గన్ ఎవరు తెచ్చారనే దానిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తుపాకులు పెట్టి అక్రమార్జన చేస్తున్నారన్న దానిపై ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఈ ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో కమిషన్ వేసి నిజానిజాలు తేల్చాలన్నారు. తప్పులు చేయకపోతే మంత్రి ఇంటికి పోలీసులు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పెట్టుబడిదారులకు స్వర్గధామంగా మారిస్తే ఈ ప్రభుత్వం తుపాకులు పెట్టి పెట్టుబడిదారులను భయపెడుతున్నారని ఫైర్ అయ్యారు. 'పాలన చేస్తున్నారా? వాటాలు పంచుకోవడానికి మీలో మీరు తన్నుకు చస్తున్నారా? మేము అగ్రికల్చర్‌ను పెంచితే.. కాంగ్రెస్ ప్రభుత్వం గన్ కల్చర్‌ను పెంచింది' అంటూ మాజీమంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# పేదలకు గుడ్ న్యూస్

- పీహెచ్‌సీల్లో హెల్త్ ఏటీఎం సెంటర్లు..
- క్షణాల్లోనే వైద్య సేవలు



**హైదరాబాద్, అక్టోబర్ 20:** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పీహెచ్‌సీల్లో 'హెల్త్ ఏటీఎం'లను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. కాగా, రెండు నెలల క్రితం హైదరాబాద్ కింగ్ కోఠి ఆస్పత్రి, మలక్‌పేట్ ఏరియా ఆస్పత్రిలో ప్రయోగాత్మకంగా హెల్త్ ఏటీఎంలను ఏర్పాటు చేశారు. ఢిల్లీకి చెందిన ఓ ప్రైవేట్ సంస్థ వీటిని అభివృద్ధి చేయగా.. క్షణాల్లోనే ప్రాథమిక ఆరోగ్య పరీక్షలన్నీ పూర్తవుతాయని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో రక్త, మూత్ర పరీక్ష నమూనాలను సేకరించి, జిల్లా కేంద్రాల్లోని టీ డయాగ్నస్టిక్ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాటి ఫలితాలు వచ్చి, రోగ నిర్ధారణ అవ్వడానికి కనీసం రెండు రోజుల సమయం పడుతుండగా.. వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ క్రమంలో త్వరితగతిన ఆరోగ్య పరీక్షల నివేదికలు అందించే హెల్త్ ఏటీఎంలను పీహెచ్‌సీల్లో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. హెల్త్ ఏటీఎంలు అత్యంత ఆధునికమైన ఇంటిగ్రేటెడ్ వైద్య పరికరాలతో పనిచేస్తాయి. శరీరాన్ని స్కాన్ చేసి, శరీర ఉష్ణోగ్రత, రక్తపోటు (బీపీ), బరువు, ఎత్తు, బీఎంఐ, రక్తంలో ఆక్సిజన్ స్థాయి వంటి మనిషి ముఖ్యమైన ఆరోగ్య సమస్యలను వెంటనే నిర్ధారిస్తాయి. ఇంకా రక్తంలో గ్లూకోజ్(షుగర్), ఈసీజీ, కొలెస్ట్రాల్, యూరిన్ టెస్టులతో పాటు, డెంగ్యూ, మలేరియా, హెచ్ఐవీ వంటి వ్యాధులకు సంబంధించిన రాపిడ్ టెస్టులు కూడా త్వరితగతిన నిర్వహిస్తాయి. హెల్త్ ఏటీఎంలు ఏకంగా 132 రకాల పరీక్షల ఫలితాలను నిమిషాల్లోనే అందిస్తాయని అధికారులు చెబుతున్నారు. రోగికి సంబంధించి హెల్త్ రికార్డు మొత్తం డిజిటల్ రూపంలో తయారవడం వల్ల సురక్షితంగా స్టోర్ చేయొచ్చు. అంతేకాకుండా హెల్త్ టెస్టుల అనంతరం రోగి ఈ యంత్రం ద్వారానే డాక్టర్ ఎక్కడ ఉన్నా అతడితో వర్చువల్‌గా మాట్లాడే అవకాశం ఉంది. హెల్త్ ఏటీఎంలో రోగి డేటా ఆధారంగా డాక్టర్ సూచనలు, చికిత్స అందించే వెసులుబాటు ఉంటుంది. కాగా, ఇప్పటికే ప్రయోగాత్మకంగా చేపట్టిన హెల్త్ ఏటీఎంల ద్వారా రికార్డు చేసిన రోగి టెస్టు ఫలితాలు.. టీ డయాగ్నస్టిక్ సెంటర్‌తో పాటు, ప్రైవేట్ ల్యాబ్‌ల టెస్టులతో కూడా సరిపోలాయి. దీంతో హెల్త్ ఏటీఎంలు ఇచ్చే ఫలితాలు చాలా ఖచ్చితత్వంతో ఉన్నాయని వైద్యశాఖ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించింది. ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆ శాఖ ఉన్నతాధికారులతో హెల్త్ ఏటీఎంలపై సమీక్షించారు. అయితే తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో ఈ హెల్త్ ఏటీఎంలు సేవలందిస్తున్నాయి. ముందుగా ఆయా రాష్ట్రాల్లో వీటి పనితీరుపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను మంత్రి దామోదర ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా హెల్త్ ఏటీఎంలను ఏర్పాటు చేయడంపై మళ్లీ ఒక కమిటీని నియమించనున్నారు. ఆ కమిటీ నివేదిక అనంతరం వీటిని కొనుగోలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

# జనవరి 21 నుంచి జేఈఈ మెయిన్

- ఏప్రిల్ 1 నుంచి రెండోదశ..
- తాత్కాలిక షెడ్యూల్ ప్రకటన త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్న ఎన్‌టీఏ




**హైదరాబాద్, అక్టోబర్20:** జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశపరీక్ష (జేఈఈ మెయిన్-2026)ను వచ్చే ఏడాది జనవరి 21 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. ప్రవేశపరీక్ష తొలిదశకు ఈ నెలలోనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపింది. అలాగే ఏప్రిల్ ఒకటి నుంచి 10 వరకు రెండో దశను నిర్వహిస్తామని పేర్కొంది. రెండో దశ కోసం జనవరి చివరి వారంలో దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించింది. ఈ మేరకు తాత్కాలిక షెడ్యూల్ ప్రకటించింది. ఈలోగా విద్యార్థులంతా వారి ఆధార్ కార్డుల్లో తప్పులు సరిచేసుకోవాలని సూచించింది. అయితే నోటిఫికేషన్ విడుదల, దరఖాస్తుల స్వీకరణ తేదీలను ఎన్‌టీఏ ఇంకా ఖరారు చేయలేదు. త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు అధికార వర్గాల సమాచారం. కాగా, దేశవ్యాప్తంగా విద్యార్థుల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకున్న ఎన్‌టీఏ.. ఈసారి జేఈఈ మెయిన్ పరీక్ష కేంద్రాలను పెంచాలని నిర్ణయించింది.



# రాజన్న ఆలయంలో దర్శనం నిలిపివేత

## భక్తుల మండిపాటు

**సిరిసిల్ల, అక్టోబర్ 20:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అధికారుల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారిని దర్శించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అయితే శ్రీ శ్రీ శ్రీ విధుశేఖర స్వామి పూజల సందర్భంగా భక్తులకు దర్శనలను నిలిపివేశారు ఆలయ అధికారులు. దీంతో గంటల తరబడి స్వామి వారి దర్శనం కోసం భక్తులు వేచి చూడాల్సిన పరిస్థితి. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్వామి వారి దర్శనాలు నిలిపివేయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విధుశేఖర స్వామి పూజలపై ముందుగా ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారు భక్తులు. ఈ విషయాన్ని అడిగేందుకు కూడా అధికారులు అందుబాటులో లేని పరిస్థితి. దీంతో భక్తులకు సమాధానం చెప్పే అధికారులు కూడా లేకపోవడంపై రాజన్న భక్తులు ఫైర్ అవుతున్నారు. దర్శనాలు లేవు అని కనీసం ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేయకపోవడంపై భక్తులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పోలీసుల పేరుతో వచ్చే ఇలాంటి కాల్స్‌తో జాగ్రత్త : సజ్జనార్ విజ్ఞప్తి



**హైదరాబాద్, అక్టోబర్20:** మీ పిల్లలను కిడ్నాప్ చేశామంటూ పోలీసుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. పిల్లల పేర్లు చెప్పి, వారు ఏడుస్తున్న శబ్దాన్ని వినిపిస్తే మానసికంగా ఆందోళనకు గురై భయపడొద్దని సూచించారు. ఈ మేరకు ఆయన ఓ నకిలీ కాల్‌తో కూడిన వీడియోను 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "అత్యాశ, భయం.. ఈ రెండే సైబర్ నేరగాళ్లకు వరంలా మారుతున్నాయి. ఈ నేరాలకు చెక్ పెట్టాలంటే అవగాహనతో కూడిన అప్రమత్త అవసరం. మీ పిల్లలు, బంధువుల వ్యక్తిగత విషయాలను ఎట్టి పరిస్థితుల్లో సోషల్ మీడియాలో షేర్ చేయొద్దు. ఇలాంటి బెదిరింపు కాల్స్ వస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయడం ద్వారా గానీ, జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ http://cybercrime.gov.inలో గానీ ఫిర్యాదు చేయండి" అని విజ్ఞప్తి చేశారు.

# 12 ఏళ్ల బాలుడి బ్యాగులో బుల్లెట్..

## హైదరాబాద్ మెట్రోలో కలకలం!



**హైదరాబాద్, అక్టోబర్20:** హైదరాబాద్‌లోని మెట్రో స్టేషన్‌లో 12 ఏళ్ల బాలుడి బ్యాగులో బుల్లెట్ లభించడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. ఓ బాలుడు కూకట్‌పల్లి సమీపంలోని ప్రగతినగర్ పరిధిలో తన తల్లితో పాటు నివాసం ఉంటున్నాడు. అయితే ఉండటం ఇష్టం లేని బాలుడు మూసాపేట మెట్రోకు ఒక బ్యాగ్‌తో వచ్చాడు. చెకింగ్ సమయంలో సెక్యూరిటీ సిబ్బంది 9ఎంఎం బుల్లెట్‌ను గుర్తించారు. వెంటనే మెట్రో ఇంచార్జికి సమాచారం అందించారు. దీనిపై మెట్రో అధికారులు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనాస్థలికి వచ్చిన పోలీసులు బాలుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. కాగా, తన తాత మిలటరీలో పనిచేసేవాడని.. తన ఇంట్లో ఉన్న బుల్లెట్‌నే తీసుకొచ్చానని బాలుడు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# నేడు దీపక్ రెడ్డి నామినేషన్..

## ముగ్గురు బీజేపీ ముఖ్యమంత్రుల రాక!



**హైదరాబాద్:** ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికపై ప్రధానంగా చర్చ నడుస్తోంది. ఉప ఎన్నికలో ఎవరు గెలుస్తారు అనే ఉత్కంఠ నెలకొంది. ప్రధాన పార్టీలు విజయం కోసం ప్రణాళికలు రచిస్తున్నాయి. ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. మరోవైపు.. ఉప ఎన్నిక నేపథ్యంలో భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు అవుతున్నాయి. ఇక, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి రేపు(మంగళవారం) తన నామినేషన్ వేయనున్నారు. ఈ క్రమంలో యూసఫ్‌గూడ హైలం కాలనీ నుంచి షేక్‌పేట్ తహశీల్దార్ ఆఫీస్ వరకు నామినేషన్ ర్యాలీ చేపట్టనున్నట్లు సమాచారం. ఆయన నామినేషన్ కార్యక్రమానికి బీజేపీ పాలిత రాష్ట్రాల ముగ్గురు సీఎంలు ముఖ్యఅతిథులుగా రానున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే గోవా సీఎం ప్రమోద్ సావంత్ అధికారికంగా కన్ఫరేషన్ ఇచ్చారు. అసోం, మహారాష్ట్ర ముఖ్యమంత్రుల కన్ఫరేషన్ కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఎదురుచూస్తున్నారు. కాగా, నామినేషన్ ర్యాలీలో తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు పాల్గొననున్నారు. పెద్ద ఎత్తున జనసమీకరణతో భారీ ర్యాలీకి తెలంగాణ బీజేపీ ప్లాన్ చేసింది.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..





# సాంస్కృతిక వారసత్వ చిహ్నం మన దీపావళి

## దీపావళి రోజు లక్ష్మీపూజలకు ప్రత్యేకం

## ప్రమిదలలో నూనెతో దీపాలు వెలగించడం శుభకరం

**తిరుమల, అక్టోబర్ 20:** భారతీయ సాంస్కృతిక వారసత్వ చిహ్నం మన దీపావళి. దీనికి అనేక కథనాలు మనకు కనిపిస్తాయి. ప్రధానంగా నరకాసురుడిని వధించన రోజుగా... దీపావళిని యుగయుగాలుగా జరుపుకొంటున్న పండుగ దీపావళి. భారతీయ సనాతన ధర్మం దీపారాధనకు విశిష్ట స్థానం ఇచ్చింది. దీపావళి నాడు లక్ష్మీ పూజ నిర్వహించాలని విష్ణు, మార్కండేయ పురాణాలు ప్రత్యేకంగా చెప్పాయి. క్షీరసాగర మథనంలో లక్ష్మీదేవి ఆవిర్భవించిన రోజును దీపావళిగా కూడా పేర్కొంటారు. దీపావళి నాటి సాయంత్రం ఇంటి ముంగిట కల్లాపు చల్లి ముగ్గులు పెట్టాలి. తులసికోట దగ్గర అలంకారాలు చేయాలి. అష్టయిశ్వైర్యాలు అనుగ్రహించే లక్ష్మీదేవితోపాటు గణపతిని కూడా అర్చించాలి. ప్రమిదల్లో దీపాలు వెలిగించాలి. షడ్రుచులతో కూడిన వంటకాలను నివేదించాలి. ధూప, దీప నివేదనలు పూర్తయిన తరువాత... ప్రమిదలను ఇంటి ముంగిట అలంకరించాలి. తులసికోట దగ్గర, ప్రతి గుమ్మానికి ఇరువైపులా దీపాలు పెట్టాలి. అలా దీపజ్యోతులతో ప్రకాశవంతమైన ఇంటికి మహాలక్ష్మి వచ్చి కొలువై ఉంటుందంటారు. దీపదర్శనం సకల పాపాలను పోగొడుతుంది. హృదయం అనే ప్రమిదలో భక్తి అనే తైలాన్ని నింపి, విశ్వాసం అనే వత్తిని ప్రేమ అనే అగ్నితో జ్వలింపజేసేదే దీపం. కళ్ళలో కనిపించే వెలుగు దాని కాంతి, జ్ఞానం అనే జ్యోతి. దీపకాంతులు విరజిమ్మే ఇంట్లో లక్ష్మీదేవి నివసిస్తుందనీ, నిత్యం ఉభయ సంధ్యల్లో దీపాలు వెలిగే ఇంట సిరిసంపదలు, సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని శాస్త్రవచనం. దీపావళి వేడుకలు ప్రాచీన కాలం నుంచి జరుగుతున్నాయి. పురాణాల్లో, ఇతిహాసాల్లో దీని ప్రస్తావన ఉంది. శ్రీఆదిశంకరాచార్యులు షణ్మత స్థాపన చేసినప్పుడు... పంచాయతన పూజా విధానంలో స్కంధునికి ప్రతీకగా... దీపారాధన ఏర్పాటు చేశారు. ఏ శుభ కార్యాన్ని ప్రారంభించినా ముందుగా దీపారాధన చేయడం ఆచారం. దీపం అగ్నికి సంకేతం. సత్కార్యాన్ని అడ్డుకోవడానికి వచ్చిన దుష్టశక్తులను దహించేయాలన్నది దానిలోని అంతరార్థం. సృష్టి, స్థితి, లయలకు దీపంతో సంబంధం ఉంది. దీపంలో కనిపించే నీలం, తెలుపు, ఎరుపు రంగులు త్రిమూర్తులకు ప్రతీకలంటారు. అదే విధంగా, విద్య, శక్తి, ఐశ్వర్యాలను ప్రసాదించే సరస్వతి, దుర్గ, మహాలక్ష్మి ఆ దీపకాంతిలో కొలువై ఉంటారని పూర్వులు చెప్పారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల వారు తమతమ ఆనవాయితీల ప్రకారం ఈ పండుగను నిర్వహించుకుంటున్నారు. ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో అయిదు రోజుల పాటు... ధనత్రయోదశి (లక్ష్మీ పూజ), నరకచతుర్దశి (నరక సంహారం), దీపావళి (నరకాసుర సంహారానికి ఆనందం ప్రకటించడం, పితృదేవతలను స్మరిస్తూ, భూలోకానికి వచ్చిన వారు తిరిగి ఊర్ధ్వలోకాలకు వెళ్ళే మార్గం సూచిస్తున్నట్టు దివిటీలు చూపించడం) ఆశ్వయుజ మాసం చివరిలో వస్తాయి. కార్తిక మాసం ప్రారంభం రోజును... అంటే 'బలి పాడ్యమి'గా పరిగణిస్తారు. ఆ రోజున గోవర్ధన పూజలు జరుగుతాయి. విదియనాడు సోదరి ఇంట సోదరుడు విందు (భగినీ హస్తభోజనం) ఆరగించి, దీవెనలు, కానుకలు ఇస్తాడు. ఇది రక్షాబంధన్‌ను పోలి ఉంటుంది. దక్షిణ భారతదేశంలో... నరక చతుర్దశి, దీపావళిగా... రెండు రోజుల పండుగగా దీన్ని నిర్వహిస్తారు. బెంగాల్ ప్రాంతంలో కాళీ పూజలు, తమిళనాడులో ప్రత్యేకంగా పితృ పూజలు చేస్తారు. దీపావళి ముందురోజే ఇంట్లో అందరూ తైలంతో అభ్యంగన స్నానం చెయ్యాలి. తైలంలో లక్ష్మి, జలంలో గంగ సూక్ష్మరూపంలో ఉంటారని శాస్త్రాలు చెప్పాయి. అలాగే దీపావళి రోజున కూడా సూర్యోదయానికి ముందే తలస్నానం చేయాలి. ఆ రెండు రోజులూ ఉదయాన్నే ఇష్ట దైవాలను పూజించాలి. దీపాలను వెలిగించి, పూజామందిరం దగ్గర, ఇంటి ముందు, తులసికోట దగ్గర ఉంచాలి. ఇకపోతే దీపావళికి కొత్తగా వ్యాపారాల లెక్కలను ప్రారంభించడం కూడా ఆనవాయితీ. అందుకే పూజలు చేసిన మరుసటి రోజు వ్యాపారులు తమ వ్యాపారలకు సెలవు ఇస్తారు.

# దీపావాళి అంటేనే దీపాలు వెలగించడం

## లక్ష్మీపూజలతో పాటు ..ఇంట్లో దీపాల వెలుగు

**విజయవాడ, అక్టోబర్ 20:** దీపావళికి ఇంట్లో దీపాలు వెలిగించడం, లక్ష్మీదేవికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఊరంతా దీపాలు వెలగించే సమయమిది. ఇళ్లల్లో అయితే ఇక చెప్పనక్కరలేదు. అయితే దీపాలు ఎక్కడెక్కడ వెలగిస్తే మంచిదో కూడా తెలుసుకోవాలి. దీపావళి అక్టోబర్ 20న సోమవారం జరుపుకుంటున్నారు. దీపావళి రోజున లక్ష్మీ దేవిని పూజించడంతో పాటు, లక్ష్మీ పూజలు చేయించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే ఇంట్లో దీపాలు వెలిగించడం కూడా చాలా పవిత్రమైనదిగా పరిగణిస్తారు. ఈ రోజున దీపాలు వెలిగించడం వల్ల ఇంటి నుండి ప్రతికూల శక్తి తొలగిపోయి సానుకూల శక్తి వస్తుందని నమ్ముతారు. కాబట్టి, దీపావళి రోజున ఇంట్లో ఆయా ప్రదేశాలలో దీపాలు వెలిగించడం శుభప్రదం. దీపావళి నాడు ఇంటి ప్రాంగణంలో దీపం వెలిగించాలి. ఇది ఇంటి నుండి ప్రతికూల శక్తిని దూరంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తుందని, జీవితంలో ఆనందాన్ని తెస్తుందని నమ్ముతారు. దీపావళి నాడు ఇంటి ప్రధాన ద్వారం వద్ద దీపం వెలిగించడం ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉంటుంది. మత విశ్వాసాల ప్రకారం, అలా చేయడం వల్ల ఇంట్లో సంపద, శ్రేయస్సు పెరుగుతుంది. ఇంట్లోకి సానుకూల శక్తి వస్తుంది. దీపావళి రోజున వంటగదిలో దీపం వెలిగించడం చాలా శుభప్రదంగా భావిస్తారు. వంటగదిలో దీపం వెలిగించడం ద్వారా, మీరు అన్నపూర్ణేశ్వరి ఆశీస్సులను పొందవచ్చు. దీపావళి నాడు, తులసి మొక్క దగ్గర దీపం వెలిగించాలి. తులసి మొక్క దగ్గర దీపం వెలిగించడం ద్వారా లక్ష్మీదేవి ఆశీస్సులను పొందవచ్చు. ఇది జీవితంలో ఆనందం, శాంతిని ఇస్తుందని నమ్ముతారు. తులసికోట వద్ద కార్తీక మాసంలో కూడా దీపాలు వెలిగిస్తారు. కొందరు దీపావళి నుంచి కార్తీకమాసం వరకు వెలిగిస్తూనే ఉంటారు.

# విక్రాంత్‌పై ప్రధాని దీపావళి వేడుకలు

- పాక్‌పై విరుచుకపడ్డ మోదీ
- త్రివిధ దళాలకు ప్రధాని సెల్యూట్



**గోవా, అక్టోబర్20:** ప్రతీ సంవత్సరం ప్రధాని మోదీ దేశ సరిహద్దుల్లో ఉండే సైనికులతో కలిసి దీపావళి వేడుక చేసుకుంటారు. ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈసారి గోవా తీరంలో నౌకాదళ సిబ్బందితో వేడుకలు చేసుకున్నారు. ఆదివారం రాత్రికే స్వదేశీ విమాన వాహన నౌక ఐఎన్ఎస్‌విక్రాంత్‌కు వెళ్లారు. సోమవారం ఉదయం నేవీ సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాకిస్థాన్‌పై కూడా మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఎన్ఎస్ విక్రాంత్ పాక్‌కు నిద్రలేని రాత్రులు మిగిల్చినట్లు గుర్తుచేశారు. "నౌకాదళ సిబ్బందితో కలిసి దీపావళి పర్వదినాన్ని చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ దృశ్యం నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఓవైపు నాకు మహా సముద్రం.. మరోవైపు భరతమాత అందించిన ధీర జవాన్ల బలం కన్పిస్తోంది. ఈ సముద్ర జలాలపై పడుతున్న సూర్యకిరణాలు.. జవాన్లు వెలిగించిన దీపపు కాంతుల వలే మెరుస్తున్నాయి" అని మోదీ కొనియాడారు. అనంతరం ఐఎన్ఎస్ విక్రాంత్ సేవలను ప్రధాని కొనియాడారు. "భారత రక్షణ దళాల సామర్థ్యానికి ఈ విమాన వాహకనౌక ప్రతీక. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఐఎన్ఎస్ విక్రాంత్.. పాక్‌ను మోకాళ్లపై నిలబెట్టింది. శత్రుమూకల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసింది. వారిని నిద్ర లేని రాత్రులను మిగిల్చింది. ఈ పేరు వింటే చాలు.. పాక్‌కు నిద్ర కూడా పట్టదు" అని మోదీ తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో పరాక్రమం ప్రదర్శించిన త్రివిధ దళాలకు ప్రధాని ఈ సందర్భంగా సెల్యూట్ చేశారు. రక్షణ రంగంలో స్వయంసమృద్ధి సాధించడం అత్యవసరం అని మోదీ పేర్కొన్నారు. మాతృభూమి కోసం ప్రాణాలర్పించేందుకు ప్రతి సైనికుడు సిద్ధమని తెలిపారు.

### ఏటా ఆనవాయితీగా..

2014లో అధికారంలోకి వచ్చినప్పటినుంచి మోదీ ఏటా సరిహద్దుల్లో సైనికులతో కలిసి దీపావళి వేడుకలు చేసుకుంటున్నారు. సైనిక దుస్తులు ధరించి.. దళాలతో ముచ్చటించి.. వారికి స్వీట్లు తినిపించి సరదాగా గడుపుతూ వారిలో స్ఫూర్తిని నింపుతున్నారు. 2014లో మోదీ తొలిసారి సియాచిన్‌లో సైనికులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. 2018లో దీపావళి రోజున ఉత్తరాఖండ్‌లోని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులతో ముచ్చటించారు. 2022లో కార్గిల్‌లో, 2023లో చైనా సరిహద్దులోని లేప్చా (హిమాచల్‌ప్రదేశ్) సైనిక శిబిరంలో వేడుకలు చేసుకున్నారు. ఇక, గతేడాది కచ్‌లోని సర్ క్రీక్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న సరిహద్దు భద్రతా దళం, ఆర్మీ, నేవీ, వాయుసేన సిబ్బందిని కలిసి వారితో వేడుకలు చేసుకున్నారు.

### రాష్ట్రపతితో ప్రధాని మోదీ భేటీ

దీపావళి నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో మోదీ సమావేశమయ్యారు. రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి, రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం అందజేసి, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను రాష్ట్రపతి 'ఎక్స్'లో పోస్టు చేశారు. అంతకు ముందు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌కుటుంబ సభ్యులు, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా తనను కలిసి శుభాకాంక్షలు తెలిపారని రాష్ట్రపతి ఫొటోలను షేర్‌చేశారు.



# ఘనంగా దివ్వెల పండగ..

## తెలంగాణలో మిన్నంటిన సంబరాలు

**హైదరాబాద్, అక్టోబర్20:** సోమవారం దేశవ్యాప్తంగా దీపావళి సందడి నెలకొంది. తెలుగు రాష్ట్రాల ప్రజలు ఘనంగా వేడుకలు చేసుకుంటున్నారు. ఇళ్లు, దుకాణాలను దీపాలతో అలంకరించారు. భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవీ పూజలు నిర్వహించారు. చిన్నాపెద్దా అంతా కలిసి బాణసంచా కాల్చుతూ సంబరాల్లో పాల్గొన్నారు. తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ బేగంపేట దివ్యాంగ పాఠశాలలో విద్యార్థులతో కలిసి వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంబరాలు చేసుకున్నారు. హైదరాబాద్‌నగరంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు దీపావళి సందడి నెలకొంది. కూకట్ పల్లి, జీడిమెట్ల, పంజాగుట్ట, ఎల్బీనగర్ , లింగపల్లి, మెహిదీపట్నం వంటి పలు ప్రాంతాల్లో సందడి మరింత ఎక్కువగా కనిపించింది. మొత్తంగా నగరమంతా దీపావళి కాంతులతో వెలిగిపోయింది. మరోవైపు దేశ ప్రధాని నరేంద్ర మోదీ మొదలు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలతో వెలుగు నిండాలని కోరుకున్నారు.









# భారత్‌కు ట్రంప్ మరో వార్నింగ్

## రష్యా చమురు కొనుగోళ్లు ఆపేంతవరకు టారిఫ్‌చెల్లించాల్సిందే!

**న్యూ ఢిల్లీ, అక్టోబర్20:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌ను మరోసారి హెచ్చరించారు. రష్యా చమురు కొనుగోళ్లు ఆపేంతవరకు భారత్ తమకు భారీ టారిఫ్‌లు కట్టాల్సిందేనని తేల్చిచెప్పారు. రష్యా చమురును కొనుగోలు చేయమని భారత్ అంగీకరించిందని ఇటీవల ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. అయితే తాజాగా మళ్లీ ఈ అంశం గురించే ట్రంప్ మీడియాతో మాట్లాడారు. రష్యా చమురు కొనుగోళ్లపై ఆయన వ్యాఖ్యలను భారత్ ఖండించిన విషయాన్ని విలేకరులు ప్రశ్నించారు. దీనికి స్పందించిన ట్రంప్ భారత్ ఒకవేళ అలా చెప్పాలనుకుంటే భారీ స్థాయిలో టారిఫ్‌లు చెల్లిస్తూనే ఉంటారని అన్నారు. కానీ, భారత్ అలా చేయదని నేను భావిస్తున్నానని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గత వారం ట్రంప్ వైట్‌హౌస్‌లో ఈ అంశం గురించి మాట్లాడారు. రష్యా నుంచి భారత్ ఇప్పటికీ చమురు కొనుగోలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మోదీతో నేను మాట్లాడని.. రష్యా చమురు కొనుగోళ్లు నిలిపివేస్తామని ఆయన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. దీనిపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. ట్రంప్-మోదీ మధ్య అలాంటి సంభాషణ జరగలేదని పేర్కొంది. ఇంధన కొనుగోళ్ల అంశంలో దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకే తాము ప్రాధాన్యం ఇస్తుంటామని స్పష్టం చేసింది. ఇక అమెరికా-భారత్ మధ్య జరిగిన వాణిజ్య చర్చలు కూడా జరిగాయి. ఇరు దేశాల మధ్య వైరుధ్యాల చాలావరకు తగ్గాయని.. మరికొన్ని రోజుల్లో సానుకూల నిర్ణయాలు వెల్లువడే అవకాశాలు ఉన్నాయని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు గతవారం కేంద్రమంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని టీమ్ అమెరికాలోని వాషింగ్టన్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. అయితే రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో భారత్‌ను హెచ్చరిస్తూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశమవుతున్నాయి.

# 3 గంటలు.. 6వేల చలాన్లు

**హైదరాబాద్, అక్టోబర్ 20:** హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగం అకస్మాత్తుగా సిటీలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా ఇష్టానుసారం డ్రైవింగ్ చేస్తున్న వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 16న మొజంజాహి మార్కెట్ కూడలిలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కేవలం 3 గంటల్లోనే 6 వేలకు పైగా కేసులు నమోదు చేశారు. పట్టుబడుతున్న వాహనదారుల్లో ద్విచక్రవాహనదారులే ఎక్కువగా ఉంటున్నారని పోలీసులు చెప్పారు. ద్విచక్ర వాహనదారుల్లో ముఖ్యంగా హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయడం, రాంగ్‌రూట్‌లో బైక్ నడపడం, సెల్ ఫోన్ డ్రైవింగ్ వంటి అతిక్రమణలపైనే ఎక్కువగా కేసులు నమోదవుతున్నట్టు తెలిపారు. ఇలా రూల్స్ అతిక్రమించి డ్రైవ్ చేస్తూ ఒక్క రోజులో సుమారు 15వేల మంది వరకు పట్టుబడ్డారని పోలీసులు చెప్పారు. మూడు గంటల స్పెషల్ డ్రైవ్‌తోనే సుమారు 6 వేల కేసులు నమోదైతే 24 గంటలూ వాహనాలపై శ్రద్ధపెడితే ఒక్కరోజులోనే సుమారు 20 వేల వరకు కేసులు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అంటున్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
మంగళవారం 21 అక్టోబర్ 2025
కరీంనగర్


# ప్రమాదకరంగా మారిన రహదారి



నేటి సాక్షి, మహబూబాబాద్(బిఆర్ నాయక్): నరసింహుల పేట మండలం ఎక్స్ రోడ్ నుండి మండల వరకు రహదారి ఇరువైపులా పెరిగిన చెట్లు స్థానిక ప్రజలు ఆందోళనకు కారణంగా మారిన రహదారి ఇప్పుడు ప్రమాదకరంగా మారింది పెరిగిన చెట్లు ప్రయాణికులకు దృష్టిని అడ్డుకోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం కనిపించకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు చెపుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులకు రహదారి పక్కన హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రజాప్రతినిధులకు కోరుతున్నారు. అయితే ఇప్పటికి వరకు అధికారులు ఈ సమస్యను పట్టించుకోవాలని ప్రజలు వ్యక్తపరు-స్తున్నారు. ప్రజలు చెప్పుతూ ప్రతిరోజు ఈ రహదారిలో వాహనాలు సన్నిహిత ప్రమాదాలను ఎదుర్కొంటున్నాయి. కనీసం హెచ్చరిక బోర్డులు చెట్లు తొలగింపు చర్యలు తీసుకుంటేనే ప్రమాదాలు తగ్గుతాయి అని పేర్కొన్నారు



వేములవాడ అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి శనివారం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థులకు పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ మధ్య తేడాలను వివరించి అవసరమైన జాగ్రత్తలను సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అడిషనల్ ఎస్పీ వెంట పట్టణ సీఐ వీరప్రసాద్ ఉన్నారు. - నేటి సాక్షి, వేములవాడ



## పల్లె గడ్డ గ్రామంలో కళాకారుడికి ఘన సన్మానం

**నేటి సాక్షి,నారాయణపేట:** పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా కేసరి కళావేదిక నాగర్ కర్నూల్ వారు నిర్వహించిన ఉమ్మడి పాలమూరు జిల్లా పద్య పఠన పోటీలలలో భాగంగా నారాయణపేట జిల్లా మరికల్ మండలం పల్లెగడ్డ శ్రీ శివపార్వతి కళానాట్యమండలి సభ్యుడు ప్రథమ బహుమతి పొందిన కుంటకొమ్ము మురళి గారికి జిల్లా రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు డా చక్రధర్ గారు మరియు యస్ తిరుపతయ్య హార్మోనిస్టు మరియు జిల్లా రంగస్థల కళాకారులు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రమాదకరంగా మారిన కల్వర్టు గుంతలు



### పట్టించుకోని అధికారులు...!?

### ఎంనోన్ పల్లి మాజీ సర్పంచ్ కావలి భారతి సచిన్ కుమార్....

**నేటి సాక్షి, నారాయణపేట:** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని ఎంనోని పల్లి నుండి ధన్వాడ మండల కేంద్రానికి వెళ్లే రహదారి లో ఉన్న కల్వటు ప్రమాదకరంగా మారిన అధికారులు పట్టించుకోవడంలేదని యమునోన్ పల్లి గ్రామ మాజీ సర్పంచ్ కావలి భారతి సచిన్ కుమార్ ఆరోపించారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పలుసార్లు ఇట్టి రోడ్డు విషయంపై పంచాయతీరాజ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు ఏమి పట్టనట్టు ఉన్నారని ఆయన ఆరోపించారు. యమునంపల్లి నుండి ధన్వాడ కెళ్ళే రహదారి ఆదమరిస్తే వాహనదారులకు తీవ్ర గాయాలు అయ్యే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు .గతంలో ఎంతోమందికి గాయాలని ఆయన గుర్తు చేశారు. వాళ్ళ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోతే గ్రామస్తుల ఆధ్వర్యంలో ధన్వాడ మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని మాజీ సర్పంచ్ కావాలి సచిన్ కుమార్ తెలిపారు.





నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
6 కరీంనగర్ మంగళవారం 21 అక్టోబర్ 2025

# సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

నేటి సాక్షి, నారాయణపేట: నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రానికి పేట నియోజక వర్గం ఎమ్మెల్యే చిట్టెం పరిణికా రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం 6 కోట్ల పదిలక్షలు మంజూరు చేసినందుకు గాను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పేట నియోజక వర్గం ఎమ్మెల్యే చిట్టెంపర్నిక రెడ్డి చిత్రపటాలకు ఆదివారం చిట్టెం నర్సిరెడ్డి చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పేట ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి,చిట్టెం మాధవరెడ్డి, ఉంగరాల వెంకట్ రెడ్డి, నరసింహారెడ్డి దామోదర్ రెడ్డి, ధన్వాడ మండల అధ్యక్షులు కావలి నరహరి, రాజేందర్రెడ్డి నాగేశ్వర్ రెడ్డి,మండల నాయకులు ఉగ్గురాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నారాయణపేట నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

**నారాయణ పేట శాసన సభ్యురాలు డా.,చిట్టెం పర్ణిక రెడ్డి**



**నేటి సాక్షి, నారాయణపేట, అక్టోబర్ 20:** నారాయణ పేట్ నియోజకవర్గ ప్రజలందరికీ శాసన సభ్యురాలు చిట్టెం పర్ణిక రెడ్డి గారు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి ప్రజల జీవితాల్లో కోటి కాంతులు నింపాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి గారు ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా.. చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి ప్రతి ఇంటా ఆనందాలను, సిరులను కురిపించాలని ఎంపీ ఆకాంక్షించారు. ఆనందాన్ని, ఐశ్వర్యాన్ని, ఆరోగ్యాన్ని ఆహ్వానించే దీపావళి పండుగ నాడు లక్ష్మీదేవి మీ ఇంటిల్లిపాదినీ సకల శుభాలతో అనుగ్రహించాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బాణా సంచా కాల్చే సమయంలో ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకోవాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి గారు ఆకాంక్షించారు..

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

**కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి**

**నిరుపేదలకు వ్యవసాయ మోటర్లు పంపిణీ**

**పేట ఎమ్మెల్యే చిట్టెం పరిణికా రెడ్డి**



**నేటి సాక్షి, నారాయణపేట:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిరుపేదలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందాయని నారాయణపేట నియోజకవర్గం ఎమ్మెల్యే చిట్టెంపర్ణిక రెడ్డి అన్నారు. నారాయణపేట నియోజకవర్గం లోని రామకృష్ణ పల్లి గ్రామ సమీపంలో నిరుపేదలకు భూ పంపిణీ కార్యక్రమం చేసిన లబ్ధిదారులకు వ్యవసాయ పంపు చెట్లు మోటార్లను నారాయణపేట నియోజకవర్గం ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుపేదలను ఆదుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలను గుర్తించి వ్యవసాయ భూములను భూ పంపిణీ కార్యక్రమం కింద పంపిణీ చేయడం జరిగిందన్నారు. అట్టి నిరుపేదలను గుర్తించి ప్రభుత్వం పంపుసెట్లు మోటార్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం 24 లక్షల 57,800 మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇద్దరు రైతుల కలిపి ఒక పంప్ సెట్ లను మోటర్లను ఇవ్వడం జరిగిందన్నారు వాటి ద్వారా వ్యవసాయదారులుగా మార్చేందుకు ప్రభుత్వం లక్ష్యం ఎంచుకున్నదని ఆమె వివరించారు. అదేవిధంగా నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ పథకం కింద గ్రామంలో 40 8 మందిని గుర్తించి ఇండ్లను మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంకే దక్కిందని ఆమె గుర్తించారు. అదేవిధంగా గతంలో కిష్టాపూర్ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రెండు మంచినీటి బోర్లను వేసిన ఘనత ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, ఉంగరాల వెంకట్ రెడ్డి, పేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎస్ సూర్య మోహన్ రెడ్డి, ధన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కావలి నరహరి, మండల నాయకులు గోటూరు నాగేశ్వర్రెడ్డి రాజేందర్రెడ్డి దామోదర్ రెడ్డి నరసింహారెడ్డి ముగ్గురాజు, చంద్రారెడ్డి , ఆంజనేయులు, రాఘవేందర్ రెడ్డి ఎలక బాలరాజు కాశీనాథ్ పాపా నాయక్, గోపాల్ శివాజీ రాజన్న ఈడి, అబ్దుల్ కలీల్ , మండల తాసిల్దార్ ఎంపీడీవో,లబ్ధిదారులు కాంగ్రెస్ పార్టీ, నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణహిత నదిలో ఒకరి గల్లంతు.

**నేటి సాక్షి, కోటపల్లి:** చెన్నూరు నియోజక వర్గంలో నీ కోటపల్లి మండలం రొయ్యలపల్లి గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. రొయ్యలపల్లి గ్రామానికి చెందిన దాగామ శ్రీశైలం సోమవారం పండగ పూట గ్రామంలో రామాయణం నాటకం ఆడటానికి ప్రాణహిత స్నానం ఆచరించడానికి ఆలుగామ గ్రామం దగ్గర ప్రాణహిత నదిలో స్నానానికి వెళ్లి స్నానం చేస్తుండగా లోతు అంచనా తెలియక ప్రాణహిత నదిలో గల్లంతయ్యాడు. అల్లుగామ గ్రామంలో విషాదం నెలకొంది. ఈతగాళ్లు,అగ్నిమాపక సిబ్బంది మరియు స్థానిక కాంగ్రెస్ నాయకుడు గట్టు లక్ష్మణ్ గౌడ్ జేక శేఖర్,తిరుపతి. కోటపల్లి ఎస్సై రాజేందర్ సంఘటన స్థలం దగ్గర ఉండి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో గురుకుల విద్యార్థి మృతి

**కళాశాలను సందర్శించిన ఎంఐఎం నాయకుడు, మాజీ కార్పొరేటర్ ఆరిఫ్**





**నేటి సాక్షి, కరీంనగర్:** నగరంలోని మైనార్టీ గురుకుల బాలుర కళాశాల-3 మగ్దూమ్ పూర్ లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న మంచిర్యాల జిల్లా చెన్నూరు కు చెందిన విద్యార్థి నదీముద్దీన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కళాశాల ఉన్నచోటనే రాజీవ్ రహదారిపై లారీ ఢీ కొట్టడంతో విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారని సుల్తానాబాద్‌పోలీసులు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆదేశాల మేరకు ఎంఐఎం నాయకుడు, మాజీ కార్పొరేటర్ ఆరిఫ్ అహ్మద్, ఖాజా మజారొద్దీన్ తక్షణమే మగ్దూమ్ పూర్ మైనార్టీ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి నదీముద్దీన్ మృతికి సంబంధించిన వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్, సుల్తానాబాద్ ఎస్సైతో తెలుసుకున్నారు. మొదట కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి చేరుకొని మార్చరీలో విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థి నదీముద్దీన్ కుటుంబ సభ్యులతో తల్లిదండ్రులతో మాజీ కార్పొరేటర్ ఆరిఫ్ అహ్మద్ మాట్లాడారు. సంఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం నాయకులు మాట్లాడుతూ కళాశాలలో వెనకవైపు గోడ మూడు ఫీట్లు మాత్రమే ఉండడంతో విద్యార్థులు సులువుగా బయటికి వెళ్లే అవకాశం ఉన్నందున ఈ ప్రమాదం జరిగిందని గుర్తించారు. గోడ ఎత్తు ఎందుకు పెంచలేదని, విద్యార్థులకు తగినంత సెక్యూరిటీ ఎందుకు కల్పించలేదని కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకోవద్దని, వారికి స్వేచ్ఛగా చదువు చెప్పడంతో పాటు తగినంత సెక్యూరిటీ కల్పించాలని, భద్రతాపరమైన లోపాలు ఎక్కువగా ఉన్నాయని, రోడ్డుకు దగ్గరగా కళాశాల ఉండడంతో విద్యార్థులు సులువుగా బయటికి వెళ్లిపోతున్నారని, ఇదంతా కొద్ది రోజులుగా జరుగుతున్నప్పటికీ భద్రతా ప్రమాణాలు ఎందుకు పాటించలేదని ప్రశ్నించారు. కలెక్టర్ తో పాటు మైనారిటీ శాఖ ఉన్నతాధికారులు కళాశాలను సందర్శించి జరిగిన పరిణామంపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు ఈ కళాశాలలో భద్రత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి ప్రాణం బలిగొన్న లారీని గుర్తించి లారీపై, లారీ డ్రైవర్ పై హత్య కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు.

**పోలీసుల కన్ఫ్యూజన్..**

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి జరిగిన ఘటనపై పోలీసులు కన్ఫ్యూజన్ లో ఉన్నారు. ప్రమాదం జరిగిన స్థలం సుల్తానాబాద్ పరిధిలోకి రాగా, మగ్దూంపూర్ మైనార్టీ గురుకుల పాఠశాల కరీంనగర్ రూరల్ పోలీసుల పరిధిలోకి వస్తున్నది. అయితే, మొదట ఘటన స్థలానికి సుల్తానాబాద్ పోలీసులు చేరుకొని, పంచనామ చేశారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖానకు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరుగకుండా పాఠశాల వద్ద బందోబస్తు నిర్వహించారు. కొందరు నాయకులు గురుకులానికి చేరుకొని ఆరా తీయగా, అంతలోనే కరీంనగర్ రూరల్ పోలీసులు పాఠశాలకు వచ్చారు. వివరాలు తీసుకున్నారు. కొద్దీ సేపు అక్కడ అయోమయం నెలకొంది.

# స్నేహితుడి కుటుంబానికి అండగా..

**మిత్ర బృందం సభ్యులను అభినందించిన గ్రామస్తులు**



**నేటి సాక్షి, పాలేరు:** ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి బాల్య మిత్రులు అండగా నిలిచారు. కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన.. చందన బోయిన గాంధీ మిషన్ భగీరథ కార్మికుడు పనిచేస్తూ.. సకాలంలో వేతనాలు అందక ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన విషయం తెలిసిందే.. గాంధీ కుటుంబాన్ని ఆదుకోవాలని ఉద్దేశంతో.. పాలేరు క్రాంతి విద్యా మందిర్ పాఠశాలలో 1996 నుండి 2006 వరకు చదువుకున్న బాల్యమిత్రులు ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వారంతా కలిసి సేకరించిన నగదు రూ. 50,000 వేల రూపాయలను వారి కుటుంబానికి ఆదివారం మిత్ర బృందం సభ్యులు అందజేశారు. ఎంతో సేవా దృక్పథంతో మృతుని కుటుంబాన్ని ఆదుకున్న స్నేహితుల ఔధర్యాన్ని గ్రామస్తులు అభినందించారు. తన భర్త స్నేహితులు అందించిన సహాయం పట్ల భార్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మిత్రబృందం సభ్యులు మాట్లాడుతూ.. కుటుంబానికి ఎల్లవేళలా సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం



**నేటి సాక్షి , నందికొట్కూరు :** దీపావళి కానుకగా నవంబర్ నెల నుంచి ఒక డిఏను విడుదల చేయడం, 60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించడం, ఆర్‌టీసీ ఉద్యోగుల ప్రమోషన్‌లపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల ఏపీ ఎన్జీవోస్ మరియు ఏపీ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దీపావళి పండుగకు ముందే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం, ముఖ్యమంత్రితో మరియు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో జరిగిన స్నేహపూర్వకమైన, గౌరవప్రదమైన, హుందాతన చర్చలు ౦ దాదాపు ఐదు సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో జరగడం ౦ సంతోషదాయకమని వారు పేర్కొన్నారు. చైల్డ్ కేర్ లీవ్‌పై ముఖ్యమంత్రి చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపిందని తెలిపారు. హెల్త్ కార్డుల విషయంలో ప్యాకేజీ రేట్లు పెంచడం, జిల్లా ఆస్పత్రుల్లో చికిత్స పరిమితిని 50,000 నుండి 1,00,000కి పెంచడం, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ నేరుగా ట్రస్ట్ ఖాతాలో జమయ్యేలా చూడటం, వైద్య సేవల సీలింగ్‌ను 2 లక్షల నుండి 5 లక్షల పైబడేలా పెంచడం, అలాగే ఆరోగ్యశ్రీ విధానాన్ని ఇన్సూరెన్స్ మోడల్‌గా మార్చే అవకాశాలను పరిశీలించాలని కమిటీకి ఆదేశించడం ౦ ఇవన్నీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ముఖ్యంగా పెన్షనర్లలో ఆనందాన్ని కలిగించే నిర్ణయాలు అని అధ్యక్షులు ఎ రాముడు పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలు, ఎన్‌జీవో హోమ్‌లను గతంలో మాదిరిగానే ప్రాపర్టీ టాక్స్ నుంచి మినహాయించడం, అలాగే చెల్లించవలసిన బకాయిలను రద్దు చేయడం కూడా హర్షణీయమని తెలిపారు. దీపావళికి ముందే ఉద్యోగ సంఘాల డిమాండ్లపై ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని పట్టుబట్టి, ఆ సమావేశాన్ని సాధించగలిగిన ఏపీ జేఏసీ అధ్యక్షులు , విద్యాసాగర్ , ప్రధాన కార్యదర్శి శ్రీ డి.వి. రమణ గారికి ఉద్యోగ సంఘాల తరఫున అభినందనలు తెలిపారు. పిఆర్సి కమిటీ ఏర్పాటు విషయంలోనూ, 57వ మెమో ప్రకారం సుమారు 11,000 మంది ఉద్యోగులను ఓపిఎస్ .. పద్ధతిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించడాన్ని కూడా జేఏసీ హర్షించింది. మిగిలిన సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల సాధనలో ఇది మొదటి అడుగు మాత్రమేనని, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, గ్రామ వార్డు సచివాలయాల నోషనల్ ఇంక్రిమెంట్లు ప్రమోషన్స్, గురుకుల పాఠశాలలో ప్రభుత్వ రంగ సంస్థల వయోపరిమితి 60 నుంచి 62 పెంచడం, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత మరియు ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం చేయడం, మిగతా అన్ని అంశాల పరిష్కారం కోసం విద్యాసాగర్, రమణ నాయకత్వంలో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ మరియు ఏపీ జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని కార్యదర్శి ఎన్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ , వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ గారికి, పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్ కి, చీఫ్ సెక్రటరీ కే. విజయానంద్ గారికి, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు ఏపీ ఎన్జీవోస్ మరియు ఏపీ జేఏసీ పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలూకా సహా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి . ఉపాధ్యక్షులు రాజశేఖర్ జాయింట్ సెక్రెటరీ చెంచన్న , ఉమెన్స్ వింగ్స్ సెక్రెటరీ వెంకట్ లత , జాయింట్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.